# మానవ నైజం మహాప్రభో!

బి. స్వర్ణ



వచ్చేదే విజయవాడ స్టేషన్!

ఎదురు చూసినంత సేపు పట్టలేదు. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ స్టేషన్ చేరుకుంది. బండి ఆగీ ఆగటంతోనే తొక్కిసలాట మొదలు. సామాన్లతో ఎక్కే ప్రయాణికులు. వారిని తప్పుకుని, దిగలేక అవస్థపడే వారి తంటాలు.

ఒళ్లో పుస్తకం తీసి పక్కన పెట్టాను!

సీట్లోంచి లేచి బద్ధకంగా ఒళ్లు విరుచుకున్నాను. అలా చేస్తూనే, ఓరకంట నలువేపులా బర్త్‌ల వేపు పరికించి చూశాను. చెప్పుల్లో కాళ్లు దూరుస్తూ ఒకరు, జారిపోతున్న పాంట్లు పైకి సర్దుకుంటూ కొందరు, జేబులు తడుముకుంటూ ఒకరు, వాటర్ బాగ్స్, బాటిల్స్ తీసుకుంటూ మరొకరు.... ఇలా ఎవరికి వారు హడావుడి పడుతున్నారు. కానీ, ఒక్కరంటే ఒక్కరు మూటా ముల్లె సర్దుకుని దిగిపోయే సూచనలు ఏ ఒక్కరి ముఖంలో కనిపించటం లేదు.

"ఊఁ.... ఈ స్టేషన్‌లో కూడా ఒక్క బెర్త్ ఖాళీ అయ్యేలా లేదు. భుజాలు కుదించుకుని, కాళ్లు దగ్గరకు ముడుచుకుని, వా ళ్లందరి వేపు తెయ్యమ్మలా చూస్తూ కాలక్షేపం చేయటమో, లేదా తల దించుకుని పదిసార్లు చదివిన పుస్తకాన్నే మళ్లీ మళ్లీ పారాయణ చేయటమో తప్పదు.

"సరే! నేను కూడా ఓ సారి కిందకు దిగితే పోలే! కుదించుకుపోయిన శరీర భాగాలు రవ్వంత సేద తీరుతాయి కదా!" చెప్పుల్లో కాళ్లు దూర్చిన తర్వాత మరో సందేహం!

"పువ్వే... పువ్వే..." అంటూ పూజిస్తున్న ఈ రవ్వంత చోటుకి రెక్కలు రావు కదా!...ఆఁ... ఇంతలోనే ఎవరొచ్చి సర్దుకుంటారు లెద్దూ! ఏమో! ఇక్కడి వాళ్లే సర్దుకుంటే?... మరీ అంత అన్యాయమా! అయినా, గత నాలుగైదు గంటలుగా సహ ప్రయాణం చేస్తున్నాను. ఆ మాత్రం ఇంగితం లేకుండా ప్రవర్తిస్తారా!" ఆ రకంగా మనసుకి సర్ది చెప్పుకుని, ప్లాట్‌ఫాం మీదకి దిగాను.

ఎక్కే వాళ్లు! దిగే వాళ్లు! ప్రయాణీకుల హడావుడి ఇంకా సద్దుమణగనే లేదు. దానికి తోడు ప్లాట్‌ఫాం నిండా జన సందోహమే! చేతుల నిండా సామాన్లతో ఉరుకులు పరుగులుగా తిరుగుతున్న జనం పళ్లు, స్వీట్లు, టీ, టిఫెన్, బొమ్మలు, పత్రికలు మొదలైనవి అమ్మే వారి అరుపులతో, బళ్ల రాకపోకల గురించి మైకుల్లో వినిపించే ప్రకటనలు, పక్క ప్లాట్ ఫారాలకు వచ్చే పోయే రైలు బళ్ల కూతలు.... ఓహ్... చూస్తుంటే, అ దొక వింత ప్రపంచంలా అనిపిస్తోంది.

లయబద్ధం కాకపోయినా, అక్కడ చెలరేగే ఆ అరుపుల అలజడిలో అన్ని రకాల శబ్దాల

మేళవింపుతో, అ దొక విధమైన శ్రుతి కదిలి వీనుల విందుగా, ఉత్సాహకరంగా ఉంది.

"అ౯...అ౯... ఆనందించింది చాలు! ఇక కదలవేయ్ కంపార్టుమెంటులోకి" అని మనను వెన్ను తట్టే సరికి ఉలిక్కి పడ్డాను.

"ఎందుకు దిగినట్టు! కప్పు కాఫీ... ఓ ప్లేటు వడ.. అదీ కాదూ... కనీసం ఒక సిగరెట్టయినా కాల్చలేదు. రెండు నిమిషాలు ఆగవేయ్ నేస్తం!" అంటూ మననును బుజ్జగిస్తూ, దూరంగా కనిపిస్తున్న కాంటీన్‌వేపు అడుగులు వేయబోయాను.

అంతలోనే ఏదో అనుమానం! యథాలావంగా తల తిప్పి చూశాను. కిటికీ లోంచి సూటిగా నేను కూర్చునే బెర్త్ కనిపిస్తోంది. నేను వదిలి వచ్చిన సీటుకి నిజంగానే రెక్క లొచ్చేట్టున్నాయి. ఎవరో కొత్త శాల్తీ. 'కూర్చోనా, వద్దా!' అన్నట్టు చుట్టూ పరికించి చూస్తోంది.

అంతే! నాకు తెలియకుండానే నా కాళ్లు చిన్నపాటి రన్నింగ్ రేస్ పాటించాయి. రెప్పపాటు కాలంలో వచ్చి నా సీటు మీద వాలిపోయాను. సారీ! సర్దుకుని కూర్చున్నాను. ఆ చీర తాలూకు కళ్లు క్షణకాలం రెపరెప లాడటం తెలుస్తూనే ఉంది.

రై లింజన్ కంటే వేగంగా కొట్టుకుంటోంది నా గుండె. ఆ శబ్దం చుట్టు పక్కల వాళ్లు ఎక్కడ గమనిస్తారో అన్నట్టు ఒక్క క్షణం కాలరు సర్దుకునే నెపంతో, గుండె గట్టిగా నొక్కుకున్నాను. మరి కొన్ని సెకన్లకి దాని ఆ అదురు తగ్గలేదు.

స్తిమితపడిన తర్వాత, ఆ శాల్తీని చూడకుండా, ఉండలేక పోయాను. ఎంతైనా చీర రెపరెప కదా! వద్దు వద్దనుకుంటూనే ఓరకంట పరికించాను. చూడు చక్కని ముద్దుగుమ్మ, పాతికేళ్లు దాటని పసిడి వయసు. తీరైన కట్టు బొట్టు. చేతిలో హాండ్ బాగ్! స్టూడెంటో! ఉద్యోగస్థురాలో, తెలియటం లేదు. కానీ, బొద్దుగా, ముద్దుగా ఉంది.

క్షణ కాలం మన సెందుకో రెపరెప లాడింది. ఆడపిల్ల. అబల. లేచి నా సీట్లో కూర్చోమంటే... అప్రయత్నంగా లేవబోతున్న నన్ను భుజాలు పట్టి నొక్కి పట్టేశాయి నా అయిదారు గంటల ప్రయాణంలో నా కెదురైన ఇక్కట్లు!

మద్రాసులో. బండెక్కాను. హౌరా వరకు ప్రయాణం! అనుకోని ప్రయాణం కారణంగా, ఎంత ప్రయత్నించినా రిజర్వేషన్ దొరకలేదు. మర్నాడు స్నేహితుడి పెళ్లి! తప్పని సరిగా వెళ్లాలి. పోస్టల్ డిపార్ట్‌మెంటు వారి పుణ్యమా అని వారం క్రితం అందవలసిన శుభలేఖ నిన్న సాయంత్రం కొంపకు చేరుకుంది. ఇదుగో! ఈ హడావుడి ప్రయాణం! జనరల్ బోగీలో, అంత దూరం ప్రయాణం అంటే ప్రత్యక్ష నరకమే! రిజర్వేషన్ బోగీలో అయితే నిలబడినా ప్రాణానికి ఉపశమనం. ఏ మాత్రం కాస్త ఈమాత్రం నుంచి వ్యవస్థా నుఖం!

మద్రాసులో బండెక్కిన తర్వాత, దాదాపు రెండు మూడు గంటల పాటు నిలువు కాళ్ల జీతమే అయింది. ఎంతో ప్రయాస, మ రెన్నో సైగలు, ఇం కెన్నో రిక్వెస్టులు అయితే గానీ, ర వ్వంత చోటు, అదీ బెర్త్‌కి ఈ చివర ఇవ్వటానికి ఇష్టపడలేదు ఆ రిజర్వేషన్ మంద భాగ్యులు.

ఆ ముద్దు గుమ్మకు సీ టిస్తే... ఆ పైన హౌరా వరకు నా పాట్లు పడే దెవరు? గప్‌చిప్‌గా, మరింత బుద్ధిగా సీట్లో ఒదిగి కూర్చున్నాను.

'సందట్లో సమారాధన' అన్నట్టు బండి కూత వేసి కదిలింది. పెద్ద స్టేషన్! కమ్మటి కాఫీ తాగుదాం అనుకున్నాను. గుండెల నిండా పీల్చుకుంటూ హాయిగా సిగరెట్ కాల్చాలని ఆశపడ్డాను.

ప్లాట్ ఫాం మీద నిలబడి ఆ అలజడి వింటూ, ఆ కోలాహలం చూస్తూ.... ఓహ్... కోరిక ఏదీ తీరనే లేదు. 'ఈ చీర రెపరెప కారణంగా సీటు కంగారులో నే నుండగానే ట్రెయిన్ విజయవాడ స్టేషన్ వదిలిపెట్టింది. బిలబిలమంటూ దిగిన జనం గబగబ ఎక్కేసి సట్టున్నారు. ఎవరి సీట్లకు వారు బదిలీ అయిపోతున్నారు.

ఆ అమ్మాయి నా ఎదురు బెర్తుని ఆనుకుని నిలబడింది. వచ్చే పోయే మగాళ్లు రానుకుపోకుండా, బెదురుగా సర్దుకుని ఒదిగినట్టు నిలబడింది. రానుకున్న పౌడర్ వాసనో, చీర మీద నుంచి వచ్చే సెంటు సువాసనో గానీ 'గమ్మత్తు'గా అనిపిస్తోంది.

ఇంతలో నోటి నిండా తంబాకు కూరుకున్న ఒ కావిడ "ఎంగె పోయిటవరె!" అంటూ సగం అర్థం అయి కానట్టు ముద్దగా ప్రశ్నించింది.

"రాజమండ్రి!" షార్ట్‌కట్‌లో నాజూగ్గా సమాధానమిచ్చింది.

కొట్టి.... కొట్టి... తెచ్చా.... అన్నట్టు ఆ ప్రశ్న ఈమె జవాబుతో అంతమై పోయింది. నాలో ర వ్వంత అయోమయం! కొం డంత కుతూహలం! ఇంతకీ ఆ అమ్మాయి ఏ భాషాకోవిదురాలో!


అలా ఎందుకు అనుమానం కలిగిదంటే ఏకత్వంలో భిన్నత్వంలా మా బోగీలోనే మళయాళీలు, మార్వాడీలు, ఉర్దూ వచ్చిన వారు, ఇంగ్లీషు మాట్లాడగలిగిన వారు, పంజాబు వతాన్లు... ఇలా సమస్త భాషా కోవిదులు నాతో [తెలుగు] కలిసి మరీ ఇందులో ఇమిడిపోయిన వారమే! మరి, ఈవిడ ఏ కోవకి చెందుతుంది? తెలుగా... తమిళమా... హిందీనా... ఇంగ్లీషా... కర్నాటకా... కథక్కా.. వగైరా.. వగైరా.! అంతుబట్టలేదు.

సాయంత్రం నాలు గ్గంటలైనా కొందరికి ఇంకా నిద్ర బద్ధకం తీరినట్టు లేదు. బెర్తుల మీద నీటి ఏనుగుల్లా దొర్లుతున్నారు. పాపం! ఆ అమ్మాయి అలానే నిలబడి ఉంది. పై బెర్త్ మీద పడుకున్న గార్దభ శాల్తీ, ఆమె తలకు తగులు తున్నాయన్న ధ్యాస కూడా లేకుండా మాటి మాటికి ఒంత్ర పెడుతూ బద్ధకంగా కాళ్లు జాడిస్తున్నాడు. ఒళ్లు మండిపోయింది. ఆమెను పక్కకి సర్దుకో మందామంటే ఏ భాషో తెలియదు. నాకు హిందీ కొన్త తెలును. ఇంగ్లీషు కూడా బాగానే మాట్లాడగలను. తెలుగు సరే సరి.

కానీ, నే నేం మాట్లాడినా... అది ఆమె కర్థం కాని భాష అయితే, నేను వెర్రి వెధవలా తెల్ల మొహం వేయాలి.

ఆమె ఉండి ఉండి నా వైపు చూస్తోంది. బహుశా నా ముఖంలోని సానుభూతి గ్రహించి నట్టుంది. కాకుంటే పదే పదే ఎందు కలా మెత్తగా, గమ్మత్తుగా చూస్తుంది. అయినా ఈ చూపుల పలకరింపుల మౌన భాష.. అన్ని భాషల కంటే మిన్నగా మనను పులకింతగా అనిపిస్తోంది.

ఇంతలో టీ.సీ మేం ఉన్న చోటుకి వచ్చాడు. టికెట్ తీసి ఇచ్చాను. చూసుకుని, తిరిగి ఇచ్చేశాడు.



"మేడమ్! మీ టికెట్!"

"పాస్!" మృదువుగా చెప్పింది.


"ఏదీ!" చేయి చాచాడు టీ.సీ

హాండ్ బాగ్ తెరిచింది. 'నిజంగా పా సేనా!' అన్నట్టు చూస్తున్నాడు టీ.సీ. నా కళ్లు కూడా కుతూహలంగా గమనించాయి. చేత్తో బ్రౌన్ కలర్ కవర్ పైకి తీసింది. అందులోంచి పింక్ కలర్‌లో ఉన్న కాగితం, పాస్ అదే కాబోలు లాగబోయింది.

"వద్దు!" అన్నట్టు చేత్తోనే సైగ చేస్తూ, "ఎక్కడి కెళ్లాలి!" అని అడిగాడు.

"రాజమండ్రి వెళ్లా లండి!"

ఆ అమ్మాయి అచ్చ తెలుగులో చెబుతుంటే నా




మనను మహదానందంతో తల మునకలైంది. ఎడారిలో ఒయాసిస్సు కనుగొన్నంత ఆనందం! మహారణ్యపు చిమ్మ చీకటిలో దారి తప్పిన వాడికి వెలుగు రేఖ కనిపించినంత సంబరం -

"ఇది రిజర్వేషన్ బోగీ!" అంటున్నాడు టి.సి.

"తెలు సండి! కానీ, ట్రెయిన్ కదిలిపోయింది. తప్పని సరై కంగారుగా ఎక్కేశాను." , ఆమె సమాధానం అది.

ఆశ్చర్యపోయాను. ఆ అమ్మాయి ఎక్కిన పది నిమిషాలకు గాని బండి కదల్లేదు. మరి ఈ... ఔరా! అతివలు అబద్ధ మాడిన అతికి నట్టుండు అన్నది నిజమే నన్నమాట.

"ఓ.కే. ఎక్కడైనా సీటు చూసి సర్దుకోండి!" సలహా ఇస్తూ ముందుకు వెళ్లిపోయా డా టి.సి.

అటు పక్క కిటికీ దగ్గర ఉన్న సింగిల్ సీట్లు బర్త్ గానే ఉన్నాయి. దాని మీద కాళ్లు బార్లా చాపి కూర్చున్న ఓ పె ద్దావిడతో "కాస్త సర్దుకుంటారా!" అని అడిగిం దా అమ్మాయి.

"వే ణామ్మా! అంగ చిన్న పొన్నుదా ఉండె! బా త్రూమ్ దా పోయిట వరె!" సగం తెలుగు యాసతో చేయి అడ్డుపెట్టి తిరస్కరించింది.

"రెండు గంటలే ప్రయాణం! వచ్చే స్టేషన్‌లో దిగిపోతాను."

"అది ఏమో తెరియాదు. ఇంగ వేణా!" ఖచ్చితంగా చెప్పింది.

పై బెర్త్ మీద దొర్లుతున్న శాల్తీ, తల వంచి, "పోమ్మా! అంగ పక్క సీట్లుదా కాళీ నేమో! మూస్కోపో!" అని సలహా ఇచ్చింది.

ఆమె విని విననట్టు ముఖం తిప్పుకుంది.

ఇంతలో... అటు వేపు కిటికీ దగ్గర భార్యాభర్తలు కాబోలు, ఎదురు బొదురుగా కాళ్లు తన్ని పెట్టుకుని మరీ కూర్చున్నారు. ఇక్కడ ఆమె సీటు అడగటం, తిరస్కరించబడటం గమనించి నట్టున్నారు. ఆ గడుసు ఆడది, కాళ్లు మరింత చాచి, చీర చెంగును సీ టంతా పరిచేస్తూ ఓర చూపులు విసురుతోంది.

అది చూడగానే న వ్వొచ్చింది నాకు.

"ఎక్కడి వరకు వెళ్లా లండీ!" తెలిసినా మాట కలపటం కోసం అడిగాను.

"రాజమండ్రి వరకు!"

"జాబ్ చేస్తున్నారా?"

"లే దండి!"

"ఇం దాక మీరు పాస్ అం టుంటేనూ -"

"ఓ ... అదా.. మా వారు రైల్వే ఎంప్లాయ్!" చిరు నవ్వుతో అంది.

"ఓ... ఐ.సీ." చుట్టూ ఓసారి పరికిస్తూ "కాళీ ఇచ్చేలా లేరు. రాజమండ్రి వరకు నిలబడడం అంటే..." అన్నాను జాలిగా.

"పర్వాలేదు. రెండున్నర గంటలు ఎంతసేపు?"

"అబ్బో! సహనవంతురాలే!" అనిపించింది.

ఇంతలో నా ఎదురు బర్త్ మీద, చివరగా పడక సీన్లో ఉన్న పది నెలల పిల్లాడు లేచి సంగీత పారాయణం ప్రారంభించాడు. పక్కనే ఉన్నతను తండ్రి కాబోలు. లేచి పిల్లాణ్ణి తీసి మా బర్త్‌కి చివర కిటికీ దగ్గర కూర్చున్న ఆడమనిషికి అందిస్తున్నాడు.

"ష్!" ఆమెను సైగగా పిలిచి "సీటు కాళీ! కూర్చోండి!" అన్నాను.

"అమ్మో! వా ళ్లూరుకుంటారా?"

"వాళ్ల బొంద! ఏం చేస్తారు? కూర్చోండి త్వరగా!"

చటుక్కున బర్త్ చివరకు ఒదిగి కూర్చుంది.

పిల్లా ణ్ణిచ్చి ఇటు తిరిగిన అతను, బంధు సమూహంతో సహా అంతా ఆమెను ఎగాదిగా చూశారు.

"జస్ట్ టు అవర్స్ జర్నీ! ఓన్లీ వన్ పర్సన్!" చేయి సాచి సర్ది చెబుతున్నట్టుగా "ప్లీజ్!" అన్నాను.

దానితో అతను స్తిమితపడి కూర్చున్నాడు.

హమ్మయ్య! నా గుండెల మీద బరు వేదో దిగిపోయినట్టు నిట్టూర్చాను. నా సీటు ఖాళీ చేసి ఆమె కిచ్చినంత సంబరం! కిటికీ దగ్గర కూర్చున్న తమిళియన్ లేడీ తన సీటే ఆక్రమించు కున్నట్టుగా గొణుగుతోంది. అది గమనించి ఆమె నా వేపు బెదురుగా చూసింది.

"మీ రేం కంగారు పడకండి! వాళ్ల సొద వాళ్లదే! పట్టించుకున్నామా గువ్వల్లా కువకువలాడుతూ ఒకటే రొద!"

"స్వానుభవమా!" నవ్వుతూ అడిగింది.

"కచ్చితంగా అంతేనండి! బాప్‌రే! గత నాలుగైదు గంటల నుంచి అర్థం కాని వీళ్ల భాషతో తికమక పడిపోతున్నానంటే నమ్మండి." మాట్లాడుతూనే వంగి బర్త్ కింద నుంచి నా ఎయిర్ బ్యాగ్ లాగి తెరిచాను. అందులోంచి బిస్కెట్ ప్యాకెట్ తీసి అందించాను.

"తీసుకోండి!" అన్నాను.

"అబ్బే, వద్దండి!" మొహమాటపడింది.

"పర్వాలేదు. తీసుకోండి, ప్లీజ్!"

మొహమాటంగానే ఒకటి తీసుకుంది. మరొకటి అందుకునే వరకు ఊరుకోలేదు నేను. అటుగా ఓ కుర్రాడు కాఫీ గ్లాసులతో వచ్చాడు. రెండు తీసుకున్నాను. ఒకటి ఆమె కిచ్చాను.

"ప్లీజ్! ఏమనుకోకండి, నా కొద్దు." స్పష్టంగా చెప్పేసింది.

"నాది డబుల్ ప్లీజ్! కాదనకండి."

నా వేపు ఇబ్బందిగా చూసి గ్లా సందుకుంది.

"చూడండీ! మీరు ఒక ఆడపిల్ల అన్న క్రేజ్‌తో నే నీ మర్యాదల ఆర్భాటం చేయడం లేదు. ఎడారి మధ్య చిక్కిన మనిషికి ఒయాసిస్సులా, భాష కాని వీ ళ్లందరి మధ్య బిక్కుబిక్కుమంటున్న నా మనసుకి తెలుగు వారైన మీ రాక ఎంతో ఆనందంగాను, ధైర్యంగాను అనిపిస్తోంది."

"భలేవారే!" నవ్వుతూ నెమ్మదిగా కాఫీ తాగసాగింది.

నేను కూడా తాగుతూ "అయినా ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు గానీ... అటు చూడండి! నా వరసలో ఉన్న ఇద్ద రాడవాళ్లు, మీ వరసలో చివర కిటికీ దగ్గర కూర్చున్న మీ ఈడు ఆడపిల్లలు... కాదు... కాదు... పిడుగులు. మళయాళమో, మరే భాషోగానీ, రెండు మూడు భాషల్లో కలగాపులగంగా మాట్లాడుకుంటూ నన్ను నా తెలుగు భాషను కామెంట్ చేస్తూ ఎంత అపహాస్యం చేశారో! ఒహెూ... మాటల్లో చెప్పడం నాకు సాధ్యం కావడం లేదనుకోండి!" కాఫీ తాగుతూనే అదంతా విన్యాసాలుగా వివరిస్తుంటే ఆమె నవ్వుతూ వింటూ మధ్య మధ్య వాళ్లవేపు చూస్తూ త లాడిస్తోంది.

ఇప్పుడు నాకు సమయం చిక్కింది. ఆ ఆడవాళ్లు గమనించేలా యథాలాపంగా

చూపించినట్లు వేళ్లు, కళ్లు వాళ్ల వేపు చూపిస్తూ మధ్య మధ్య నవ్వుతూ, నవ్విస్తూ ఆమెతో కబుర్ల కాలక్షేపం చేస్తూ, వాళ్లను బాగా ఉడికించి వంతు తీర్చుకున్నాను.

ఆ అమ్మాయి హ్యాండ్‌బ్యాగ్‌లోంచి కొత్త వీక్లీ తీసింది. వెంటనే పదిసార్లు పారాయణం చేసిన పాత వీక్లీ ఆమె కిచ్చి కొత్త వీక్లీ తీసుకున్నాను.

పుస్తకం పేజీలు తిరగేస్తూ "ఏమిటోనండీ! ఆడవాళ్లే కదా! ప్రతి ఒక్కరి పక్కన ఎంతెంత సీటు ఖాళీ! అయినా రవ్వంత చోటు ఇవ్వడానికి ఒప్పుకోవడం లేదు!" అంది.

"మనిషి నైజం అంతేనండి. అందుబాటులోకి రానంత వరకు తపన! అందిన తర్వాత స్వార్థం!" అన్నాను వేదాంత ధోరణిగా.

"ఏమో, బాబూ! మన మైతే అంత కఠినంగా ఉండలేం!"

"అది నిజమే!" ఒప్పుకున్నాను.

"అయినా వాళ్లలా మనం కూడా టికెట్లని, పాస్‌లని చట్టబద్ధమైన రీతిలోనే ప్రయాణం చేస్తున్నాం కదా! కానీ మన మేదో అంటరాని వాళ్లమో, లేక ఉచితంగా ప్రయాణిస్తున్నట్లో నిరసన భావంతో వ్యవహరిస్తా రెందుకండీ!"

"బర్త్‌ల రిజర్వేషన్ల మహిమండి, బాబూ!" అన్నాను.

"ఏం రిజర్వేషన్లో గానీ, అన్ని విషయాల్లోనూ ఈ రిజర్వేషన్ల పోటీ ఎక్కువైపోతోంది." విసుగుదలగా అంది.

నవ్వుకుంటూ పుస్తకం తెరిచాను.

విజయవాడ వరకు మాట రాని మూగవాడిలా, భాషలేని భావంలా కుదించుకుపోయిన నాకు ఆమె తోడుతో మలయమారుతం మనసుని తాకినట్టు పులకింతగా అనిపిస్తోంది.

పైగా మా భాషలో మేం అనర్గళంగా మాట్లాడుకుంటుంటే, మా చుట్టూ ఉన్న వాళ్లు మా మాటలే వీనులవిందుగా వింటున్నారో, మా సన్నిహిత సంభాషణకు ఈర్ష్య పడుతున్నారో గానీ అందరి చూపులు, చెవులు మా వేపే! నా మనసు ఏదో సాధించినట్టే గర్వంతో పొంగిపోతోంది.

కబుర్ల కాలక్షేపంతో కాలమే తెలియలేదు.

బండి తాడేపల్లిగూడెం కూడా దాటిపోయింది.

ఇంతలో నా ఎదురు సీట్లో అంటే ఆమెపక్క శాల్తీలు రెండు పై బర్త్‌ల మీదకు వెళ్లిపోయాయి. సరిగ్గా అప్పుడే ఇద్దరు గ్రామీణ దంపతులు అక్కడ కొచ్చారు. పాపం వాళ్లు వైజాగ్ వెళ్లాలట. పాసింజర్ టికెట్స్ కొని, తెలియక ఈ బండి ఎక్కేశారట. టీ.సీ. చెకింగ్‌కి వచ్చినప్పుడే కేకలు వేస్తుంటే తెలిసింది.

"రాజమండ్రిలో దిగి బండి మారండి" అని టీ.సీ. హెచ్చరించడం కూడా విన్నాను. అప్పటి నుంచి తలుపు దగ్గరే నిలబడిపోయారు. మరి ఇప్పు డెందు కొచ్చినట్టు? ఆలోచిస్తుండగానే వాళ్లు అక్కడ ఖాళీ అయిన చోటులో కూర్చోబోయారు.

"ఆఁ! ఆఁ! ఉన్నా రిక్కడ! అలా వెళ్లి నిలబడండి!" ఆమె వారించింది.

"ఆ బాబులు పీది కెక్కి నిద్దరోతున్నారుగా, తల్లే! నిలుసొని నిలుసొని పిక్కలు తిరగబడిపోతండాయి! కూసింతసేపు కూకుడో నియ్యిమ్మా!" ఆడమనిషి బ్రతిమలాడారు.

"వద్దొద్దు! వాళ్లు దిగి వస్తే పేచీ! అయినా టీసీ గారు మిమ్మల్ని తలుపు దగ్గరే సర్దుకోమన్నారుగా! ఇలా రిజర్వేషన్ సీట్ల దగ్గరకొస్తే ఎలా? టీసీ వస్తే మీకు పెనాల్టీ వేస్తారు, పొండి పొండి" అని బెదిరిస్తోంది.

పుస్తకంలోంచి తలెత్తకుండానే పైచూపుగా చూశాను. చిత్రం! అరడుగు చోటులో అంతకుముందు అణకువగా సర్దుకున్న ఆ తెలుగింటి పడుచు మొత్తం ఆరడుగులకు సరిపడ్డట్టు [సారీ! ఖాళీ అయిన ఇద్దరి సీట్లను] ఆక్రమిస్తూ, కాళ్లు రెండూ పైన పెట్టుకుని బాసింపట్టు వేసు క్కూర్చుంది.

"ఏమో బాబూ! మన మైతే అంత కఠినంగా



ఉండలేం!" అని ప్రగల్భాలు పలికిన పడతేనా అహఁ... మానవనైజం! తనవరకు వచ్చేసరికి మనిషికి ఎంత స్వార్థం! ఎంత తాపత్రయం! న వ్వొచ్చింది.

పాపం! అంతకుమించి మాట్లాడితే ఏం తప్పో అన్నట్టు ఆ గ్రామీణ దంపతులు బిక్క ముఖాలతో తిరిగి తలుపు దగ్గర కెళ్లిపోయారు.

మరో అరగంటకి బండి రాజమండ్రీ స్టేషన్లో ఆగింది.

"మీ కంపెనీకి చాలా చాలా కృతజ్ఞతలు" అంటూ ఓ చిరునవ్వు చిందించి చల్లగా దిగి వెళ్లిపోయింది ఆమె.

గంట, గంటన్నర ఆలస్యం కావడంతో అప్పటికే రాత్రి ఏడున్నర దాటిపోయింది. 'భోజనం చేయటమా! టిఫిన్ కట్టించుకోవటమా!' క్షణకాలం సందిగ్ధం. చివరకు రెండు టిఫిన్ పొట్లాలు కట్టించుకున్నాను. కప్పు కాఫీ తాగి బం డెక్కాను.

బండి బయల్దేరే సమయానికి ఓ రెండు మూడు కొత్త శాల్తీలు లోపలకు వచ్చాయి. సీట్లకోసం వాళ్ల కళ్లు వేట మొదలుపెట్టాయి. నా ఎదురుగా ఖాళీగా ఉన్న బర్త్ వేపు సర్దుకోబోయారు.

"సార్! ఇది కోరమాండల్ ఎక్స్‌ప్రెస్!" గ్రామీణు ల్లాంటి కే సేమో అని హెచ్చరికగా అన్నాను.

"తెలుసండి!" భారీ శరీరం గల అతను సమాధాన మిచ్చాడు.

"మరి మీ టికెట్స్?"

"మాది రైల్వే పాస్!"

"అలాగా! అయితే ఇది రిజర్వేషన్ బోగీ!"

"అది కూడా తెలుసండి బాబూ! ఆడవాళ్లతో, పిల్లలతో జనరల్ బోగీ ప్రయాణం కష్టం! రెండు మూడు గంటలే కదా! ఎలాగో సర్దుకోవచ్చుని..." సమాధానమిస్తూనే సర్దుకోబోయాడు.

తీరుబాటుగా టిఫిన్ పొట్లాలు విప్పుకోబోతున్న నేను "సార్! ఒక్క నిముషం!" అని వారిస్తూ గబగబా టిఫిన్ పొట్లాలు చుట్టబెట్టేశాను. నా ఎదురు బెర్త్ అంటే ఆ తెలు గింటి పడుచు ఫ్లస్ పైకి చేరిన రెండు శాల్తీల ఖాళీ చోటులోకి సర్దుకున్నాను. మరుక్షణమే నా బట్టల బ్యాగ్ తీసి తల కింద పెట్టుకుంటూ ఆ కాస్త చోటులో ముడుచుకుని పడుకున్నాను.

"అదేమిటి, సార్! అక్కడైతే మా కందరికీ చోటు సరిపోతుందని ఆశపడితే..." భారీ శాల్తీ నిష్టూరమాడింది.

"సారీ, సర్! ఇది రాత్రికి నా రిజర్వేషన్ బర్త్! అసలే ఆరోగ్యం సరిగా లేదు. ఏ డెనిమిది గంటల నుంచి కూర్చుని ప్రయాణం చేశాను. ఒక అరగంటయినా రెస్టు లేకపోతే కష్టం!" అంటూ నోటి కొచ్చిందల్లా కోసేశాను.

పిల్లలు కాబోలు కీసరబాసరగా అరుస్తున్నారు. ఆడమనిషి గొణుగుతోంది. ఆ భారీ శాల్తీ విసుక్కుంటోంది. అయినా నేను పట్టించుకోలేదు. టిఫిన్ సంగతి, ఆకలి మాట గాలి కొదిలేశాను. పై శాల్తీలు రెండు కిందికి చేరే లోపలే ఈ మాత్రం బడలికైనా తీర్చుకోవాలి. వాళ్లు దిగివస్తే ఇక హౌరా వరకు కూర్చుని కునుకుపాట్లు పడకతప్పదు. అదీ నా ఆరాటం!

ఆ ఆరాటంలోంచే అర్థం కాని అలజడి. ఆ అలజడి వలయంలో చోటివ్వని మళయాళీ ఆడవాళ్లు, ఇతరులు, ఆ పైన గ్రామీణులకు సీ టివ్వని తెలిగింటి పడుచు. ఇప్పుడు సీట్ల వేటలో అవస్థ పడుతున్న ఆ కుటుంబీకుడు... వారిని కాదన్న నేను... క్షణకాలం గతుక్కుమంది నా మనసు.

'ఆఁ! హాఁ...హా... ఎంత స్వార్థం! ఎంత తాపత్రయం! ఊఁ మానవనైజం. మహాప్రభో!' అంటూ నా అంతరాంతరాలలోని అంతరాత్మ పరిహాసంతో ఫక్కున నవ్వింది. నవ్వుతూనే ఉంది.

దాన్ని నొక్కిపట్టి బలవంతంగా కళ్లు మూసుకున్నాను. రాని నిద్రకోసం ప్రయత్నిస్తూ.

అయితే ఏ మాట పట్టింపులతో, ఏ మనుషుల ప్రవర్తనతో తనకు ప్రమేయం లేనట్టు ఎందరికో ఎంద రెందరికో తనలో చోటిస్తూ వారి వారి గమ్యాలకు చేర్చడానికి చురుగ్గా ముందుకు సాగిపోతోంది కోరమాండల్ ఎక్స్‌ప్రెస్! ★